క్లుప్తంగా

20న నృత్య పోటీలు ముగింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఈనెల 20వ తేదీతో శాస్త్రీయ నృత్య పోటీలు ముగుస్తాయని ప్రజాహిత సేవా సంస్థ అధ్యక్షుడు రాజారత్నం రెడ్డి తెలిపారు. చిత్తూరులోని రెవెన్యూ భవనంలో ఈపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు రెండో విడత పోటీలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఈనెల 13న మొదటి విడత పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆయన పేర్కొన్నారు.

ఏపీపీగా శరవణకుమార్



చిత్తూరు లీగల్: నగరానికి చెందిన న్యాయవాది ఎన్.శరవణకుమార్‌ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా నియమిస్తూ రాష్ట్ర హోంశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. చిత్తూరులోని 9వ అదనపు జిల్లా కోర్టులో ఈయన మూడేళ్లపాటు ఏపీపీగా కొనసాగనున్నారు. ఇందుకుగాను నెలకు రూ.40 వేల గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: పల్లెల్లో పారిశుధ్య లోపం లేకుండా చూసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. గురువారం మండలంలోని ఎ.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌వేలు మాట్లాడుతూ.. పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ బలోపేతానికి కృషి

పలమనేరు: ఎంఆర్‌పీఎస్ బలోపేతానికి కృషి చేస్తామని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు హరిక్రిష్ణ మాదిగ తెలిపారు. గంటావూరులో గురువారం ఎంఆర్‌పీఎస్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల అధ్యక్షులను నియమిస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు జగన్నాథం, మల్లికార్జున, కిశోర్, ప్రకాష్, నరసింహులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: ఏపీ విద్యాశాఖ, సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ నిర్వహిస్తున్నామని, వాటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ లీలారాణి తెలిపారు. ఆమె గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ విద్యపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో చదువుకునేందుకు అవకాశం లేని వయోజనుల కోసం ప్రభుత్వం 1991లో సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్ స్కూల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇందులో పదో తరగతితోపాటు ఇంటర్‌ను కూడా చదవవచ్చని తెలిపారు. చదువుకు దూరమైన వారు, మధ్యలో ఆపేసిన వారు మళ్లీ చదువును కొనసాగించవచ్చని చెప్పారు. ప్రవేశాలకోసం స్థానిక ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 బాలసుందరం, కోర్సు డైరెక్టర్ షంషీర్, సుబ్రమణ్యం, హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో పెళ్లి



ప్రేమ జంటతో రొంపిచెర్ల పోలీసులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల పోలీస్‌స్టేషన్‌లో గురువారం పోలీసులు ప్రేమజంటకు వివాహం చేశారు. సీఐ సూర్యనారాయణ కథనం మేరకు.. కేవీ.పల్లె మండలం మహల్‌రాజుపల్లెకు చెందిన వంశీ(24), నందిని(19) ప్రేమించుకున్నారు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. వారు ఇంటి నుంచి వచ్చేశారు. బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో రొంపిచెర్లలో వెళుతుండగా పోలీసులకు అనుమానం వచ్చి విచారించారు. విచారణలో తాము ప్రేమించుకున్నామని, పెళ్లి చేసుకునేందుకు వెళుతున్నట్టు వారు పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి విచారించారు. ఇద్దరు మేజర్లు కావడంతో పోలీసు స్టేషన్‌లోనే వివాహం చేశారు.

బస్సులు రాని బస్టాండ్

- అలంకారప్రాయంగా ప్రయాణ ప్రాంగణం
- వినియోగంలోకి తీసుకురావడంలో నిర్లక్ష్యం
- రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



బంగారుపాళెంలో నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెంలో పేరుకే ఆర్టీసీ బస్టాండ్. అక్కడికి ఒక్క బస్సు రాదు.. పోదు. ఫలితంగా ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో బస్సుల కోసం రోడ్ల పక్కనే గంటల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోంది. బస్టాండ్ ఆవరణం అధ్వాన్నంగా దర్శనమిస్తోంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది. బస్టాండును ఏళ్ల తరబడి వినియోగంలోకి తీసుకురాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని డిపోల ఆర్టీసీ బస్సులు బంగారుపాళెం మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. చెన్నై–బెంగళూరు నగరాలలో ప్రైవేట్ కంపెనీలలో పనిచేసే ఉద్యోగులు మండలం నుంచి పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు, పలమనేరు, చిత్తూరు పట్టణాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు ప్రతిరోజూ ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే ప్రయాణికులు ఎండైనా, వానైనా రోడ్లపైనే బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఇక వర్షం వస్తే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. విద్యార్థులు, ప్రయాణికులు బస్సుల కోసం ఎక్కడ నిలబడాలో తెలియని దుస్థితి నెలకొంది. బస్సులు వచ్చిన వెంటనే ఒక్కసారిగా విద్యార్థులు రోడ్లపై ఉరకులు, పరుగులు తీస్తుండడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

రాత్రిపూట అవస్థలు

రాత్రి ఎనిమిది దాటితే బంగారుపాళెంకు రావాలంటే ప్రయాణికులు అవస్థలు పడాల్సిందే. ఆర్డినరీ బస్సులు ఉండవు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు బంగారుపాళెంలోకి రావు. బైపాస్ మీదుగా వెళ్లిపోతున్నాయి. దీంతో బంగారుపాళెం పరిసర గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో చిత్తూరు, పలమనేరు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ సర్వీసులు బంగారుపాళెం మీదుగా నడపాలంటూ పలుమార్లు ప్రజాప్రతినిధులు ద్వారా ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. మండల సర్వసభ సమావేశాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులను రాత్రి సమయాల్లో బంగారుపాళెం మీదుగా నడపాలని ప్రస్తావించినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు.

ఫలించని అద్దె ప్రయోగాలు

నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను పునరుద్ధరించి బస్సుల రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు బస్టాండ్ ప్రాంగణాన్ని అద్దెకు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు. ఏడాది క్రితం ఆర్టీసీ అధికారులు బంగారుపాళెంలో ఆర్టీసీ బస్టాండ్ స్థల ప్రాంగణాన్ని పరిశీలించి స్థలాన్ని అద్దెకు ఇచ్చేందుకు ప్రయత్నాలు సాగించారు. టెండర్ల ద్వారా స్థలాన్ని అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో అద్దెకు వచ్చేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో అధికారులు ఆ ప్రయత్నం మానుకున్నట్లు తెలుస్తోంది.

30 ఏళ్లగా నిరుపయోగమే..

1995లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బంగారుపాళెంలో పోలీస్ స్టేషన్ పక్కన రూ.20 లక్షలతో అన్ని హంగులతో బస్టాండ్‌ను నిర్మించారు. ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీటి కోసం బస్టాండు ఆవరణలో బోరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించారు. బస్టాండ్ నిర్మించినప్పటి నుంచి ఆ సౌకర్యాలు నేటి వరకు వినియోగంలోకి రాకపోవడం గమనార్హం. బస్టాండ్‌ను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు, ప్రయాణికులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. దీంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడంలేదు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బస్టాండ్ ఆవరణలో వృథాగా మరుగుదొడ్లు

వినియోగంలోకి తీసుకురావాలి

రూ.లక్షలు ఖర్చు వెచ్చించి బస్టాండ్ నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ప్రయాణికులు దూర ప్రాంతాలకు వెళ్లాలంటే రోడ్లపైనే పడిగాపులు పడుతున్నారు. ఇంత పెద్ద ఊరులో బస్టాండ్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

–రామన్, ప్రయాణికుడు, గుడియాత్తం

నిరీక్షణ తప్పడం లేదు

బస్టాండ్ వినియోగం లేకపోవడంతో బస్సుల కోసం జాతీయ రహదారి పక్కన దుకాణాల ముందు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. ఎండ, వానకు తడుస్తూ ఎదురు చూస్తున్నాం. రాత్రి సమయంలో మరీ ఇబ్బందులు పడుతున్నాం, ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల కోసం రహదారి పక్కన కనీసం కూర్చునేందుకు తగిన ఏర్పాటు కూడా చేయలేదు.

–ఆదిలక్ష్మి, ప్రయాణికురాలు, కుప్పం

పారిశుధ్య పనుల పరిశీలన



వీరభద్రకాలనీలో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలో పారిశుధ్య పనులు మెరుగ్గా ఉండాలని నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన నగరంలోని వీరభద్రకాలనీ, తేనెబండ రోడ్డు, నీవానది పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అలాగే తేనెబండ గంగాకాలనీలోని ఈఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకులను పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల వచ్చే వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. మరమ్మతులకు లోనైన బోరు మోటార్లను వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అనంతరం వీరభద్రకాలనీలో నీటి సరఫరా సమస్యపై స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంహెచ్‌ఓ లోకేష్, డీఈ శ్రావణి, ఏఈ లోకేష్ పాల్గొన్నారు.

విద్యతోపాటు విలువలు ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు చిన్నతనం నుంచి విద్యతోపాటు విలువలు ముఖ్యమని చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వర్ అన్నారు. గురువారం కొంగారెడ్డిపల్లిలోని సంసిద్ క్యాంఫోర్డ్ పాఠశాలలో నిర్వహించిన పదవీ స్వీకార వేడుక కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనంలోనే ఉన్నత ఆశయాలను నిర్దేశించుకోవాలన్నారు. సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఎన్నికల్లో ఎన్నుకున్న విద్యార్థులకు బాధ్యతలు అప్పగించారు. పాఠశాల క్లస్టర్ మేనేజర్ అరుణ్, హెచ్‌ఎంలు వెంకట్, వినోద్, హరిప్రియ పాల్గొన్నారు.

గ్రామాల్లో కుక్కల బెడద



బసవాపల్లె వద్ద రోడ్డుపై కుక్కలు

గుడిపాల: మండలంలోని పలు గ్రామాల్లో రోజురోజుకు కుక్కల బెడద అధికమవుతోంది. గుడిపాల మండలానికి ఆనుకొని తమిళనాడు రాష్ట్రం ఉండడంతో తమిళనాడు వాసులు కుక్కలను ఇక్కడ వదిలి వెళుతున్నారు. దీంతో గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు గ్రామస్తులను కుక్కలు కరుస్తుండడంతో ఆస్పత్రుల పాలవుతున్నారు. రాత్రివేళల్లో కుక్కల అరుపులకు నిద్రకూడా పోలేకపోతున్నామని కొందరు వాపోతున్నారు. మండలంలోని నంగమంగళం, బొమ్మసముద్రం, గట్రాళ్లమిట్ట, 197రామాపురం, వసంతాపురం, బసవాపల్లె గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చలో విజయవాడ పోస్టర్లు విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న నేతలు

చిత్తూరు కార్పొరేషన్: గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ ఉద్యోగుల సమస్యలపై ఈనెల 21న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం వద్ద పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఈఈ కార్యాలయంలో ఈఈ మునిచంద్రకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ జేఎల్‌ఎం గ్రేడ్–2లకు పాత సర్వీసు రూల్ ప్రకారం ఏఎల్‌ఎం పదోన్నతి కల్పించాలని, కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని, ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, సచివాలయ ఉద్యోగులతో సమానంగా జేఎల్‌ఎంలకు సెలవులు మంజూరు చేయాలి అనే డిమాండ్లు పరిష్కరించాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అందుకు నిరసనగా చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతలు చంద్ర, రఘు, బాలు, దొరబాబు, దినకరన్, శివకుమార్ పాల్గొన్నారు.



ఈఈకి వినతిపత్రం ఇస్తున్న నేతలు

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ



హెచ్‌ఎంకు విరాళం ఇస్తున్న పూర్వవిద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ అలవరచుకోవచ్చని కణ్ణన్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నేత శ్రీరాములు అన్నారు. ఈ మేరకు గురువారం నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిఫాం కొనుగోలుకు ఆర్థికసాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉంటారన్నారు. హెడ్‌మాస్టర్ కోమల మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల దేశభక్తితో పాటు స్కౌటింగ్, స్కిల్స్, టీం వర్క్ పెరుగుతాయన్నారు. అనంతరం పూర్వవిద్యార్థి శ్రీరాములు తన వంతు సాయంగా స్కౌట్స్ యూనిఫాం కొనుగోలుకు రూ.15 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

రొంపిచెర్ల: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని కల్లూరు సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఆయన గురువారం రొంపిచెర్ల సర్కిల్‌లో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లె–తిరుపతి జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని తెలిపారు. 45 రోజుల్లోనే నలుగురు మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉంటే ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. అంతేగాక పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. అలా ఇస్తే రూ.25 వేల జరిమానాతోపాటు 6 నెలలు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేల జరిమానా విధిస్తామని వెల్లడించారు.

రెండు రోజులు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శని, ఆదివారాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుంది. ఈమేరకు వినియోగదారులు మార్పును గమనించాల్సిందిగా ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర కోరారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు నగర పరిధిలో గిరింపేట, మిట్టూరు, రామ్‌నగర్‌కాలనీ, బాలాజీనగర్, రూరల్ పరిధిలోని తుమ్మిందపాళ్యం, పరిసరా ప్రాంతాలు, యాదమరి ఐటీసీ పరిశ్రమ ప్రాంతాల వద్ద విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సంతపేట, పైపల్లె, చెర్లోపల్లె, వెంగనపల్లె, మురకంబట్టు, ఆర్వీఎస్ నగర్, సీతమ్స్ కళాశాల, అరగొండ, కొంగారెడ్డిపల్లె, మోర్ధానపల్లె, బుడితిరెడ్డిపల్లె, బీఎస్‌ఆర్‌పేట, రెడ్డిగుంట పరిసర ప్రాంతాల్లో ఉండవన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సంతపేట, పైపల్లె, చెర్లోపల్లె, వెంగనపల్లె, మురకంబట్టు, ఆర్వీఎస్‌నగర్, సీతమ్స్‌కళాశాల, అరగొండ, కొంగారెడ్డిపల్లె, మోర్ధానపల్లె, బుడితిరెడ్డిపల్లె, బీఎస్‌ఆర్‌పేట, రెడ్డిగుంట పరిసర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వివరించారు.

పుష్ప పల్లకీలో జగదభిరాముడు



పుష్పపల్లకీలో భక్తులకు దర్శనమిస్తున్న జగదభిరాముడు

తవణంపల్లె: టి.పుత్తూరులోని పురాతన కోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం పుష్పపల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు చేసి ధూప దీప నైవేద్యం సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ

ఆలయంలో సాయంత్రం సీతారామలక్ష్మణులకు ఊయల సేవను వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పట్టువస్త్రాలు, గజమాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు.

వైభవంగా ఊరేగింపు

కోదండ రామాలయంలో గురువారం రాత్రి స్వామికి పుష్పపల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పట్టు వస్త్రాలు, గజమాల, పుష్పాలు, పూజాసామగ్రితో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం పల్లకీలో జగదభిరాముడు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

నేడు తిరుమంజనం

కోదండరామాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామికి తిరుమంజనం, సాయంత్రం ఊయల సేవ, రాత్రి కల్పవృక్ష వాహన సేవ ఉంటుందని ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు.

సచివాలయాలకు చంద్ర గ్రహణం

- సేవలకు మంగళం
- కొత్తరేషన్ కార్డులు, పింఛన్ల మంజూరుపై ప్రశ్నిస్తున్న జనం
- సర్వేల పేరుతో ఇంటింటికీ సచివాలయ ఉద్యోగులు
- ఉద్యోగుల్లో అసంతృప్తి జ్వాల



గుడిపాలలోని సచివాలయం

గుడిపాల: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించాల్సిన సేవల పరిస్థితి నానాటికి తీసికట్టుగా మారింది. 554 రకాల సేవలందిస్తున్న గ్రామ/వార్డు సచివాలయాలను కూటమి ప్రభుత్వం క్రమంగా దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్న తీరు అటు ప్రజల్లోనే కాకుండా ఇటు ఉద్యోగుల్లోనూ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ అందజేయడమే లక్ష్యంగా 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. చిత్తూరు నియోజకవర్గంలో చిత్తూరు అర్బన్‌లో 51 వార్డు సచివాలయాలు, గుడిపాలలో 17, చిత్తూరు రూరల్‌లో 9 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 600 మందికి పైగా ఉద్యోగులు సేవలందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ పథకాలకు లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

14 నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే సచివాలయాల్లో సేవలకు గ్రహణం పట్టింది. సేవలను పూర్తిగా నీరుగార్చడంతో ప్రజలు తమ సమస్యలపై కలిసేందుకు మండల కేంద్రాల్లో అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అక్కడా పరిష్కారం కాకుంటే ఆర్డీఓలు, జిల్లా కేంద్రానికి వెళ్లి తమ బాధలను చెప్పుకొని వినతిపత్రాలు ఇస్తున్నారు. ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అనధికారికంగా కూటమి నాయకులే చూస్తుండడంతో సచివాలయాలు వెలవెలబోతున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాల్లో కూటమి నేతల జోక్యంతో అర్హులకు అన్యాయం జరుగుతుండగా, కూటమి కార్యకర్తలకు మాత్రమే లబ్ధిచేకూరుతోంది.

రేషన్‌కార్డు, పింఛనెప్పుడు ?

ఇంటింటి సర్వే, పింఛన్ల పంపిణీ సమయంలో ప్రజల వేసే ప్రశ్నలకు సచివాలయాల ఉద్యోగుల వద్ద సమాధానం ఉండడం లేదు. కొత్త పింఛన్లు, రేషన్‌కార్డు కోసం ఆశగా అడుగుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం ఇంకా వెబ్‌సైట్ ఓపెన్ చేయలేదని చెపుతున్న పరిస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 14నెలలు గడిచినా పేద, మధ్య తరగతి కుటుంబాలకు రేషన్‌కార్డ్ మంజూరులో ప్రభుత్వం అలసత్వాన్ని ప్రదర్శిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, అన్నదాత సుఖీభవకు సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా స్వీకరించకపోవడం ప్రభుత్వ పాలన తీరును తేటతెల్లం చేస్తోంది.

సర్వేలతో కుస్తీలు

గత ప్రభుత్వంలో వలంటీర్లతో సర్వేలు చేయించడాన్ని తప్పుబట్టిన అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు .. తాను అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. ఏకంగా సచివాలయ ఉద్యోగులను సర్వేల పేరుతో నిరంతరం తరుముతున్నారు. మొత్తం 15 రకాల ఇంటింటి సర్వేలతో సచివాలయ ఉద్యోగులు కుస్తీలు పడుతున్నారు. సర్వే చేస్తున్నాం.. ఓటీపీ చెప్పండి అని అడిగితే జనం ఛీదరించుకుంటున్నారని, తమకు కనీస గౌరవం లేకుండా పోతోందని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. సెలవు రోజుల్లో కూడా సర్వేలు చేయాలని చెప్పడం సర్వే పేరుతో టార్గెట్లు పెట్టడం, మరోవైపు మాతృశాఖ పనులు, బీఎల్‌ఓ విధులు ఇలా అన్ని రకాల పనులు పూర్తిచేయాలని ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఆదేశాలతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. పని ఒత్తిడి తగ్గించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

వి.కోట: మండలంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కావిడ మాసం ప్రారంభం కావడంతో వి.కోట పట్టణ సమీపంలోని దాసార్లపల్లిలో వున్న సుబ్రహ్మణ్యస్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తిని పుష్పపల్లకీపై కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించారు.



పల్లకిలో సుబ్రహ్మణ్యస్వామి